# గడ్డ పెల్లగించి....

గోదావరీ తీరం

జలజలమంటూ పారుతున్న నీటి సవ్వడి.

గలగలమంటూ చెట్లాకులు చేస్తున్న చప్పుడు, దూరం నుంచి వినిపించే వేదఘోషలా.

బిలబిల మంటూ పులుగులూ పిట్టలూ ఎగురుతున్న రొద.

ఎండవానలు ప్రవేశించలేని చూడచక్కని పూలతోట. ఆ తోట మధ్యలో ఒక చిన్న పర్ణశాల. తాళ వృక్షాల దూలాలతో వాసాలతో వేయబడింది. వెదురునారతో పెండెలు. అడవిలోని ఆకూ అలమూ కప్పుగా ఉపయోగించబడింది. పర్ణశాలలోంచి పాచికలాడుతున్న చప్పుడు ఉన్నట్టుండి మాటలు వినవచ్చాయి.

'పాపం, మరదిగారు ఎంత కష్టపడుతున్నారో చూశారా... అయోధ్య లోని రాజభవనం కంటె ఈ పర్ణశాల కనుల పండువు చేస్తోంది...'

'అవును సీతా. లక్ష్మణుని వంటి తమ్ముడు నాకు లభించడం నేను చేసుకున్న అదృష్టం...'

'ఆర్య పుత్రులన్నది అక్షరాలా నిజం'.

'తమ్ముడే చెంత లేకుంటే ఈ వనవాసం నరకప్రాయంగా కనిపించేది...'

'ఇంకా సందేహమా! నిద్రాహారాలు మాని మనకోసం ఎంత కష్టపడు తున్నారో మరదిగారు! కంటికి రెప్పలా మనల్ని కాపాడుతున్నారు, పగలు రాత్రీ మనకోసం కందమూలాలు వెదికి వెదికి తెస్తున్నారు...'

'తమ్ముణ్ణి ఎంత పొగడినా తనివి తీరదు...సీతా...ఇవాళ యిలా ఆడుతున్నావేమిటి?'

'ఒక్కసారి వాకిలి వంక చూడండి...' సంభ్రమాశ్చర్యాలతో సీత పలికిన మాటలు వినిపించాయి.

పాచికల సవ్వడి వినిపించలేదు.

'ఏమిటీ అద్భుతం... ఎన్నడూ చూడలేదే యిలాంటి బంగారు లేడి!...'

'మీరన్నట్టు ఈ కనకమృగం నిజంగా అద్భుతమే. ఆ వెండి చారలు! పైడి కొమ్ములు! చెంగు చెంగున అది ఎగురుతుంటే, యీ పూల తోటకే ప్రాణం వచ్చినట్టుంది... నాకోసం ఆ లేడిని తీసుకురారూ... నా ముద్దు చెల్లించరూ...' ప్రేమగా అడిగింది సీత.

'తమ్ముడూ...'

'తలుచుకుంటే మీరాలేడిని క్షణంలో తీసుకువస్తారు. మరది గారిని యిబ్బంది పెట్టడమెందుకు?'

'పిలిచావా అన్నయ్యా!'

'ఆ లేడిని చూశావా?'

'మన వాకిట్లోకి వచ్చినప్పుడే చూశాను. నీకు తెలియందేముంది అన్నయ్యా! ఇది మాయల లేడి....'

'నిజంగా!'

'అవును అన్నయ్యా! దోవలో మనం ఎన్నో పల్లెలు పట్టణాలు పర్వతాలు నదులు చూశాము. ఎక్కడైనా బంగారు లేడిని చూశామా? ఇది ఆ రాక్షసి మాయ! ముక్కూ చెవులూ కోసినందుకు, మనమీద యీ విధంగా కసి తీర్చుకుంటోంది. అన్నయ్యా నా మాట నమ్ము....'

రాముడు సీత వంక చూశాడు. చిన్నబుచ్చుకున్న భార్యను చూడగానే రోషం వచ్చిన వాడిలా కనిపించాడు రాముడు.

'అడిగిన వస్తువు యివ్వకుంటే అయోధ్య సైతం అడవిగా తోచవచ్చు సీతకు. కోరిన వస్తువూ మనసు పడినదీ యివ్వకపోతే పుట్టింటివారిని తలచుకుంటూ లోలోపల బాధ పడవచ్చు. కోరికోరి కష్టాలు తెచ్చుకున్న సీతను సంతోషపరచడం నాధర్మం కాదా?....'

లక్ష్మణుడు మౌనం వహించాడు.

సీత ప్రసన్నంగా కనిపించింది.

'ఇప్పుడే ఆ కనక మృగాన్ని పట్టి తెస్తాను' అంటూ రాముడు విల్లు బాణాలు చేతిలోకి తీసుకున్నాడు. 'నేను తిరిగి వచ్చేంతవరకు వదినె వద్ద నిన్ను కాపలా పెట్టి వెడుతున్నాను జాగ్రత్త...' భార్యను చూస్తూ రాముడు ముందుకి అడుగులు వేశాడు.

మాయలేడి గంతులు వేస్తూ పుట్టలు గుట్టలు చెట్టూచేమలు దాటుతూ, అక్కడక్కడ ఆగుతూ మళ్లీ ఎగురుతూ కనబడీ కనబడక అడవిలో మునుముందుకి వెళ్లసాగింది. రాముడు వెంబడించాడు. చివరికి అగ్నిబాణం వేశాడు. లేడి గంతులు మాయమైనాయి. హడలిపోయింది. రాక్షసరూపంతో నేలమీద పడింది. అలా పడుతూ 'హ సీతా, హా లక్ష్మణా నన్ను కాపాడు... కాపాడు...' అని ఆర్తనాదం చేసింది.

ఆర్తనాదం సీతకు వినిపించింది. భయాందోళనలు చెందసాగింది. 'విన్నావా మరిదీ, మీ అన్నగారి ఆర్తనాదం. ఆయన కేదో ఆపద వచ్చినట్టుంది. త్వరగా బయలుదేరి వెళ్లు. వెళ్లి మీ అన్నగారిని చూడు...' మాటలు తడబడగా సీత పలికింది.

'సప్తసముద్రాలు ఇంకిపోవచ్చు; అన్నయ్యకేమీ భయము లేదు వదినా' అన్నాడు లక్ష్మణుడు. అతని మాటలలో భయం లేదు; దిగులు లేదు. ప్రశాంత గంభీరంగా కనిపించాడు.

సీత సహనం కోల్పోయింది. కళ్లెర్రజేసింది. మాటలు నిప్పులు కక్కాయి. 'జ్ఞాతులు శత్రువులు కారా? నీవు మాత్రం భరతుని వంటి తమ్ముడివి కావా? అతడు అన్నగారి రాజ్యం ఆశించాడు; నీవు ఆ అన్న గారి సతిని అభిలషిస్తున్నావు....'

వదినెగారి మాటలములుకులు కడుపులో చెయ్యిపెట్టి కలిపినట్లుగా తోచాయి లక్ష్మణుడికి. చెవిలో శూలాలు గుచ్చినట్లుగా అనిపించింది. ఒడలంతా నిప్పులు పాకినట్లుగా ఒకటే తాపం. హరిహరీ అంటూ చెవులు మూసుకున్నాడు. వెంటనే ఏడు గిరులు వాకిటి ముందు గీశాడు. 'ఎలాంటి

పరిస్థితిలోనూ ఈ గిరులు దాటి రాకు. మన కర్మ ఎలా వుంటే అలా జరుగుతుంది' అన్నాడు. ధైర్యం సన్నగిల్లి. పుట్టలలో ఉన్న భుజగేంద్రులారా, కొండలలో ఉన్న మృగేంద్రులారా, భూమాతా, మునులారా... దశరథుని కోడలు, జనకుని కూతురు, రాముని భార్య మీ భూమి మీద ఉన్నది. ఆమెకు కాపాడే భారం మీదే... అంటూ లక్ష్మణుడు నడిచాడు. నేల కంపించింది. పూలతోట తల వంచింది. చెట్టు చేమలు ఆకులు రాల్చాయి, కంట తడి పెట్టినట్లుగా; వెలుతురు మటుమాయమయింది, కర్పూరం హరించి పోయినట్లుగా.

రామలక్ష్మణులు లేని సమయం... సీత ఒంటరిగా ఉండే వేళ కోసం ఎదురు తెన్నులు చూసిన రావణాసురుడు తన అదృష్టం పండిందను కున్నాడు. పౌర్ణమి నాడు పొంగిన సముద్రుడయ్యాడు. ఏ వేషంతో సీత వద్దకు వెళ్లడమా అని రకరకాలుగా ఆలోచించాడు. చివరికి కపట సన్యాసి వేషం ఉచితమనుకున్నాడు.

ఒంట్లో ప్రాణాలు లేని వృద్ధబ్రాహ్మణవేషం ధరించాడు. అడుగడుక్కీ 'ఆదినారాయణా ఆదినారాయణ' అంటూ వచ్చాడు పర్ణశాల వద్దకు.

అభమూ శుభమూ ఎరగని సీత వచ్చిన వృద్ధుడు నిజమైన సన్యాసి అనుకుంది. సన్యాసిని గౌరవించడం ధర్మ మనుకుంది. అంతే. మరది గీసిన గిరుల్నీ, మాటల్నీ విస్మరించింది. అర్ఘ్యపాద్యాలు సమర్పించింది. అయిదు పది చేసింది. పర్ణశాలలో ఉన్న పండ్లుఫలాలు తెచ్చి సన్యాసి ముందు ఉంచింది.

నిర్భయంగా ఈ అడవిలో ఒంటరిగా వున్నావు. భర్త యింట్లో లేడా?' ప్రశ్నించాడు కపట సన్యాసి.

'వాకిట్లో గంతులు వేస్తున్న కనకమృగాన్ని చూచేసరికి నాకు మతి పోయింది. అది తీసుకురమ్మని నా భర్తను పంపాను...' చెప్ప లేక చెప్పింది. బంగారు వేడి పట్ల మొదట చూపిన సంతోషం ఇప్పుడు లేదు. భర్తను తలచుకోసాగింది. కన్నీళ్లు కాలువలు కట్టాయి.

'రాజ్యం పోగొట్టుకుని, కందమూలాలు ఆరగిస్తూ మునిలా కాలం గడిపే భర్తను గురించి ఎందుకమ్మా కంట తడిపెడతావు! నావంక చూడు. నాతో పాటు నా లంకా రాజ్యానికి వచ్చావా, నీకు ఏడు వారాల సొమ్ములు ఇస్తాను. మేడలలో మిద్దెలలో ఉండవచ్చు. దాసదాసీలు నీ అడుగులకు మడుగు లొత్తుతారు. నిన్ను నా పట్టపు రాణిగా చేసుకుంటాను....' కపట సన్యాసి తనకున్న పది తలలు చూపాడు. వికృత వేషం బయట పడింది. మలిన మనస్సు అద్దంలో బింబమయింది.

రాక్షసరాజు పది తలలు చూసీ చూడగానే, సీత మూర్ఛపోయింది. మూకవమామిడి విరిగి పడినట్లుగా, గోరుచుట్టుపై రోకటి పోటులా చెవిపోటుకి సన్నాయిజోడు తోడుగా.... జంకసాగింది... వణకసాగింది. నేలమీదికి ఒరిగిపోయింది.

నేలమీద ఉన్న ఆ భూపుత్రిని చూశాడు, రావణుడు.

అతని మలిన హృదయం కల్లు త్రాగిన మర్కట మయింది.

మూర్ఛబోయిన సీత పడివున్న గడ్డను శూలంతో పెల్లగించాడు. పెల్లగించిన గడ్డను అలాగే తాకకుండా తన రథంలో ఉంచుకున్నాడు; లంకకు తరలి వెళ్లాడు.

పగ తీరిపోయిందనుకున్నాడు రావణుడు...

(ఈ కథకు ఆధారం తెలుగు జానపద సాహిత్యంలోని సంక్షేపరామాయణం మొదలైన పాటలు)

✦ ✦ ✦